

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,80,140లు వచ్చాయని అధికారులు తెలిపారు.



గుప్తేశ్వర్‌లో దొంగల చేతివాటం!

-8లో



భాషను బతికించుకుందాం

బరంపురం: నగరంలోని ప్రభుత్వ బాలికల తెలుగు పాఠశాలలో మహాత్మాగాంధీ హెల్పింగ్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు.

న్యూస్‌రీల్

సాంస్కృతిక అధికారిగా వినోద్‌కుమార్



వినోద్‌కుమార్ బెహరా

బరంపురం: జిల్లా సాంస్కృతిక శాఖ అధికారిగా వినోద్‌కుమార్ బెహరా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన బరంపురం మున్సిపాలిటీ కార్పొరేషన్(బీఎంసీ) డిప్యూటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తుండేవారు.

భక్తులకు పులిహోర వితరణ



ప్రసాదం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: పట్టణానికి చెందిన మహిళా క్లబ్ ఆధ్వర్యంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకుని మజ్జిగౌరి మందిరం ప్రాంగణంలో భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు టి.రస్మిత, కార్యదర్శి కస్తూరి సాహు, సభ్యులు శాంతికుమారి దే, అల్కా దాస్, టి.వాణి తదితరులు పాల్గొన్నారు. క్లబ్ తరఫున సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈసారి భక్తులకు ప్రసాద వితరణ చేపట్టామని వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ మోతీలాల్‌నగర్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్ర వ్యక్తులు తీవ్ర గాయాల పాలయ్యారు. బాధితులు అభిరాం తడక(29), గణేష్ మండంగి(23), భాస్కర్ సాబొరొ(21)గా గుర్తించారు. వీరిలో గణేష్, భాస్కర్ గుణుపూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, అభిరాం పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దులో నిలిచిన రాకపోకలు



రోడ్డుపై అడ్డంగా నిలిచిపోయిన భారీ వాహనం

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మీదుగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విశాఖపట్నం నుంచి రాయపూర్ వెళ్తున్న భారీ ట్రాలీ వాహనంలో సాలూరు–సుంకి మార్గం మధ్యలో మొరాయించింది. అతి పెద్ద యంత్రాన్ని తరలిస్తూ ఘాట్ రోడ్డులో మలుపు వద్ద అడ్డంగా నిలిపోయింది. దీంతో దాదాపు 5 గంటలకు పైగా రాకపోకలకు అడ్డంకిగా మారింది. జాతీయ రహదారి కావడంతో వందలాది వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాయి. క్రేన్ సాయంతో యంత్రాన్ని రోడ్డు పక్కకి తప్పించడంతో నిరీక్షణకు తెరపడింది.

ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ




ఈ-లైబ్రరీని పరిశీలిస్తున్న కలెక్టర్ స్మృతిరంజన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ బ్లాక్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ మంగళవారం తనిఖీ చేశారు. 5టీ పథకంలో భాగంగా చేపట్టిన స్మార్ట్‌క్లాసులు, ఈ-లైబ్రరీ, టాయిలెట్లు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యార్థులతో మాట్లాడి, తెలుసుకున్నారు. పరిశీలనలో కాశీనగర్ బీడీఓ కపిలేశ్వర తండి, తహసీల్దార్ ఆశిష్ ప్రధాన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జస్టిస్ శుభాసిష్ ప్రమాణ స్వీకారం

- ఒడిశా హైకోర్టు 33వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతల స్వీకరణ
- ప్రమాణ స్వీకారం చేయించిన రాష్ట్ర గవర్నర్ గణేషీలాల్
- సోమవారంతో ముగిసిన జస్టిస్ మురళీధర్ పదవీకాలం





జస్టిస్ శుభాసిష్‌తో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ గణేషీలాల్

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు 33వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శుభాసిష్ తలపత్ర మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కటక్ హైకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్ కొత్త సీజేతో ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం పదవీ విరమణ చేసిన జస్టిస్ డాక్టర్ ఎస్.మురళీధర్ స్థానంలో జస్టిస్ శుభాసిష్ తలపత్ర బాధ్యతలు చేపట్టారు. 2022 జూన్ 10నుంచి ఆయన రాష్ట్ర హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అత్యంత స్వల్ప నిడివికి ఆయన రాష్ట్ర హైకోర్టుకు నియమితులు కావడం విశేషం. ఈ ఏడాది అక్టోబర్ 3న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ లెక్కన రెండు నెలల కంటే తక్కువ వ్యవధితో ఆయన రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తిగా బాధ్యతలు నిర్వహించనున్నారు. జూలైలో సుప్రీంకోర్టు కొలీజియం అతని పేరును ఈ పదవికి సిఫార్సు చేసింది. జస్టిస్ శుభాసిష్ రెండు హై కోర్టులలో తీర్పులను జారీ చేయడంలో గణనీయమైన అనుభవం సాధించిన న్యాయమూర్తిగా కొలీజియం పరిగణనలోకి తీసుకుంది. 2013లో త్రిపుర హైకోర్టు ఏర్పాటైంది. అక్కడి నుంచి హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తి హోదాకు ఇప్పటి వరకు ఎవరూ ప్రాతినిధ్యం లేదు. ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని జస్టిస్ శుభాసిష్ తలపత్రకు ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిపాదించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

పుట్టుపూర్వోత్తరాలు..

జస్టిస్ శుభాసిష్ 1961 అక్టోబర్ 4న త్రిపుర ఉదయపూర్‌లో జన్మించారు. కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఆర్ట్స్, న్యాయశాస్త్రంలో పట్టభద్రులుగా ఉత్తీర్ణత సాధించారు. 1990 సెప్టెంబర్ 12న అస్సాం, నాగాలాండ్, మేఘాలయ, మణిపూర్, త్రిపుర, మిజోరం, అరుణాచల్‌ప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యత్వం పొందారు. అతను ప్రధానంగా గౌహతి హైకోర్టు అగర్తలా బెంచ్‌లో ప్రాక్టీస్ చేశారు. 2004 డిసెంబర్ 21న సీనియర్ న్యాయవాదిగా ఎదిగారు.

హైకోర్టు న్యాయమూర్తిగా..

2011 నవంబర్ 15న గౌహతి హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2013 సెప్టెంబర్ 13న త్రిపుర హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అతను 2సార్లు కోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. 2018 నవంబర్ 2 నుంచి నవంబర్ 13, 2019 నవంబర్ 11 నుంచి నవంబర్ 15వరకు త్రిపుర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం గత ఏడాది జూన్ 1న రాష్ట్ర హైకోర్టుకు బదిలీ అయ్యారు. జూన్ 10న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు.

నేడే బొనొకొ లగ్గి



పూరీ శ్రీమందిరం

- పూరీలో సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపివేత
- దాదాపు నెల తరువాత జగన్నాథునికి అలంకరణ

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలో బుధవారం బొనొకొ లగ్గి(శ్రీ ముఖ అలంకరణ) సేవ నిర్వహించనున్నారు. గత వారం జరిగిన పూరీ శ్రీమందిర్ పాలకమండలి సమావేశంలో నిర్ణయం మేరకు దత్త మహాపాత్రో సేవకులు రత్న వేదికపై మూల విరాట్‌లకు ఈ సేవ చేపడతారు. బుధవారం ద్వితీయ భోగ మండప క్రతువు ముగిసిన తర్వాత బొనొకొ లగ్గి ప్రారంభిస్తారని శ్రీ జగన్నాథ ఆలయ పాలకవర్గం(ఎస్‌జేటీఏ) వెల్లడించింది. ఈ సందర్భంగా సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 11గంటల వరకు ఆలయం లోకి సాధారణ భక్తుల ప్రవేశం నివారిస్తారు. ఈ నేపథ్యంలో సుమారు 5గంటల పాటు సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపి వేయనున్నట్లు ఆలయ అధికార వర్గాలు తెలిపారు. శ్రీమందిర్ రికార్డ్ ఆఫ్ రైట్స్ ప్రకారం బొనొకొ లగ్గి సేవ నెలకు కనీసం నాలుగు సార్లు నిర్వహించాల్సి ఉంది. దేవస్థానం అధికార వర్గాలు, శ్రీముఖ అలంకరణ సేవలో పాల్గొనే దత్త మహాపాత్రో సేవకుల మధ్య బిగుసుకున్న వివాదంతో ఈ సేవ దీర్ఘకాలంగా స్తంభించి పోయింది. దీని ప్రభావంతో ఈ ఏడాది జూలై 1న ముగిసిన రథయాత్ర అంతిమఘట్టం నీలాద్రి విజే నుంచి రత్న వేదికపై బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథుని మూల విరాట్‌ల ముఖ అలంకరణ జరగక పోవడంతో మసకబారి పోయాయి. ఈ ప్రతిష్టంభన తొలగించేందుకు గతవారం జరిగిన ఆలయ కార్యనిర్వహణ కమిటీ సమావేశం ఫలప్రదం కావడంతో సేవ పునరుద్ధరణ సాధ్యమైంది. ఈ సమావేశం తీర్మానం మేరకు నెలకు 2సార్లు బుధవారం నిర్వహించేందుకు ఏకాభిప్రాయం కుదిరింది. బుధవారం అనుకూలించని పరిస్థితుల్లో ఆలయ అధికార వర్గాల సంప్రదింపులతో బొనొకొ లగ్గి సేవ గురువారం నిర్వహించవచ్చని వెసులుబాటు కల్పించినట్లు పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ వర్మ తెలియజేశారు.

రాహుల్‌గాంధీని కలిసిన కొరాపుట్ ఎంపీ



రాహుల్‌గాంధీ, శశిథరూర్‌తో కొరాపుట్ ఎంపీ సప్తగిరి

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాహుల్‌గాంధీని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవన సముదాయంలో మంగళవారం ఈ భేటీ జరిగింది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వం పునరుద్ధరణ, పార్లమెంట్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో సంభాషణ జరిగింది. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో ఆ రాష్ట్ర పరిశీలకుడిగా ఉల్క వ్యవహరిస్తుండటంతో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేయండి

- కేంద్రమంత్రికి నవరంగపూర్ ఎంపీ వినతి



అర్జున్ ముండాకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీ రమేష్ మాఝి

కొరాపుట్: నవరంగ్‌పూర్ జిల్లాలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలు ఏర్పాటు చేయాలని నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌చంద్ర మాఝి కోరారు. ఈ మేరకుకేంద్ర గిరిజన వ్యవహారాల శాఖామంత్రి అర్జున్ ముండాను ఢిల్లీలోని అతని కార్యాలయంలో మంగళవారం కలిసి, వినతిపత్రం అందించారు. నవరంగ్‌పూర్ జిల్లాలో నందాహండి, తెంతులకుంటి, డాబుగాం, చందాహండి సమితులలో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. పూర్తిగా వెనుకబడిన ఈ ప్రాంతంలో కేంద్రప్రభుత్వం ఈ విద్యాలయాలు ఏర్పాటు చేస్తే గిరిజన బాలలకు ఉన్నత విద్య అందుతుందని వివరించారు.

భూములకు పట్టాలు అందించాలని డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, లబ్ధిదారులు

జయపురం: తమకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు పట్టాలు ఇవ్వాలని బొయిపరిగుడ సమితి ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొయిపరిగుడ తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. సహిద్ లక్ష్మణ నాయక్ ప్రతిమ నుంచి వందలాది మంది ప్రజలు ఎర్ర జెండాలు చేతపట్టి, నినాదాలతో కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సీపీఐ బొయిపరిగుడ శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ శిఘ్నరాణి చౌధరికి వినతిపత్రం అందించారు. జొలొ, జంగిల్, జొమి(నీరు, అడవి, భూమి) లపై ఆదివాసీ, హరిజన, గిరిజనుల హక్కుల సాధనకు ఈ ఆందోళన చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ మహంతి తెలిపారు. డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని జిల్లా కార్యదర్శి జుధిష్టర్ రౌలొ స్పష్టంచేశారు. ఆందోళనలో కమ్యూనిస్టు పార్టీ జోనల్ కార్యదర్శి బుద్రబొడొ నాయక్, సహాయ కార్యదర్శి లక్ష్మణ ముదులి, ఆదివాసీ నాయకులు నంద హరిజన్, నర్సింగ కమర, రామ ఖీలో, సాయిబ్ పంగి, నీలకంఠ కమర్ తదితరులు పాల్గొన్నారు.

మైత్రీ చేయూత



శస్త్రచికిత్స అనంతరం ఆస్పత్రిలో భవానీశంకర్, అతని తండ్రి సుశాంత్

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ సుంగేరు గ్రామంలో వివిధ సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్న మైత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీ ఓ నిరుపేద కుటుంబాన్ని ఆదుకుంది. పంచాయతీలోని సగుబరి గ్రామానికి చెందిన సుశాంత్ నాయక్ కుమారుడు భవానీశంకర్(13) గత కొద్ది నెలలుగా గుండె సంబంధిత సమస్యతో బాధ పడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో కొడుకు చికిత్స చేయించలేక సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న మైత్రీ కంపెనీ అధినేత శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. విశాఖపట్నం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బాలుడిని చేర్పించి, సొంత ఖర్చులతో గుండె ఆపరేషన్ చేయించారు. ప్రస్తుతం భవానీశంకర్ ఆరోగ్యం స్థిమితంగా ఉందని వైద్యులు తెలిపారు. శ్రీనివాసరావు చొరవ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధంగా స్వాగత ద్వారం



తుది మెరుగులు దిద్దుకుంటున్న స్వాగత తోరణం

జయపురం: పట్టణ సమీపంలోని సతీ నదీ తీరంలో జయపురం మున్సిపాలిటీ యంత్రాంగం నిర్మిస్తున్న స్వాగత తోరణం తుది మెరుగులు పూర్తి చేసుకుంది. దాదాపు రూ.30 లక్షల వ్యయంతో ఆదివాసీ సంప్రదాయం ఉట్టిపడేలా దీనిని రూపొందించారు. దీనిని ప్రారంభోత్సవానికి సిద్ధం చేసినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. విజయవాడ-రాంచీ 326 జాతీయ రహదారి బమిణిగాం సతీనది కూడలి వద్ద నిర్మిస్తున్న ఈ స్వాగత తోరణాన్ని ఆయన పరిశీలించి, పనులను పర్యవేక్షిస్తున్న వార్డు కౌన్సిలర్ విష్ణువర్ధన్ రెడ్డి, స్థానికులతో మాట్లాడారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

జయపురం: సబ్ డివిజన్ పరిధి ఉమ్మిరి సమీపంలో రైలు పట్టాలపై తల మొండెం వేరుపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల కంట పడింది. వెంటనే జయపురం రైల్వే పోలీసులకు సమాచారం అందించగా, రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. పట్టాలకు ఒకవైపు తల, రెండో వైపు మొండెం పడి ఉన్నాయి. అయితే ఇది హత్య? ఆత్మహత్య? మృతుడి వివరాలు తెలియలేదు. దీనిపై జీఆర్‌పీ సిబ్బంది కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

భువనేశ్వర్-భవానీపట్న విమాన సేవలు

- ఉత్కళ విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలకు డీజీసీఏ ఆమోదం



ఉత్కెళ విమానాశ్రయం

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్న నుంచి భువనేశ్వర్‌కు త్వరలో విమానయాన సౌకర్యం అందుబాటులోకి రానుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) భవానీపట్న సమీపంలోని ఉత్కెళ విమానాశ్రయం నుంచి విమానాల రవాణాకు అనుమతించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విమానాశ్రయం నుంచి వాణిజ్య విమానాల నిర్వహణకు లైసెన్స్ జారీ చేసింది. కేంద్రప్రభుత్వ ప్రాంతీయ కనెక్టివిటీ పథకం ఉడాన్(ఉడే దేశ్ కీ ఆమ్ నాగరిక్) కింద ఉత్కెళ ఎయిర్‌స్ట్రిప్ ప్రాంతీయ విమానాశ్రయంగా అభివృద్ధి చేశారు. ఈ మేరకు డీజీసీఏ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్, చీఫ్ ఏవియేషన్ సెక్యూరిటీ ఆఫీసర్(సీఏఎస్ఓ), ఎయిర్‌పోర్ట్సు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ), సీఐఎస్ఎఫ్ నోడల్ అధికారుల నేతృత్వంలోని ప్రత్యేక బృందం జూలైలో ఎయిర్‌స్ట్రిప్‌ను సందర్శించి సౌకర్యాలు, ఇతర భద్రతా ప్రామాణికలను అధికారుల సమక్షంలో సమీక్షించారు. దీని ఆధారంగా ఉత్కెళ ఎయిర్‌స్ట్రిప్‌కు 2బి లైసెన్స్ మంజూరు చేసే సౌకర్యాలపై బృందం సంతృప్తి వ్యక్తం చేశారు. భద్రతా చర్యల దృష్ట్యా కొన్ని మార్గదర్శకాలను సూచించారు.

కొండచిలువ పట్టివేత



సర్పాన్ని బంధిస్తున్న హెల్ప్‌లైన్ సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్ఏసీ 1వ వార్డులోని మాసిమి మా మందిరం సమీపంలో కొండచిలువ కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకు సమాచారం అందించగా, సిబ్బంది రాజేంద్ర ఖొరా చేరుకొని, సర్పాన్ని బంధించారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత 2రోజులుగా కురుస్తున్న వర్షాలతో సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. బంధించిన సర్పాన్ని బలిమెల అటవీశాఖ రేంజర్ ప్రశాంత్ రౌత్ పరిశీలించి, ఆరోగ్యంగానే ఉన్నారు. 7అడుగుల పొడవైన దీని బరువు దాదాపు 30 కిలోలు ఉందన్నారు. అనంతరం చిలువను చిత్రకొండ ఘాట్ రోడ్డు లోని అడవి లోకి విడిచిపెట్టారు.

బరి తెగించిన గంజాయి మాఫియా

- మూకుమ్మడిగా ఫిరింగియా పోలీసు స్టేషన్‌కు నిప్పు
- 5 ప్లటూన్ల పోలీసు బలగాలు మోహరింపు
- 19మంది అరెస్ట్, 50మందిపై కేసులు నమోదు



గంజాయి బస్తాలతో సహా తగల బడుతున్న ఫిరింగియా పోలీసు స్టేషన్



ఫిరింగియా గ్రామంలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది



పోలీసుల అదుపులో గంజాయి మాఫియా

బరంపురం: మావోయిస్టుల దుర్గంగా ఉన్న కొంధమాల్ జిల్లా ఫిరింగియా పోలీసు స్టేషన్‌ను గంజాయి మాఫియా నిప్పు పెట్టి, తగలబెట్టిన ఘటన చర్చనీయాంశంగా మారింది. దీనిపై తీవ్రంగా స్పందించిన దక్షిణాంచల్ రేంజ్ డీఐజీ సత్యబ్రత భొయి ఆదేశాలతో కొంధమాల్ జిల్లా ఎస్పీ సుబెందకుమార్ పాత్రొ ఫిరింగియా బ్లాక్‌లో 144 సెక్షన్ జారీ చేశారు. 5ప్లటూన్ల పోలీసు బలగాలను మోహరించారు. ఈ నేపథ్యంలో ఎస్‌డీపీఓ ప్రసన్న మల్లిక్ నాయకత్వంలో తహసీల్దార్ అనురుధ్ నాయక్ సమక్షంలో ఫిరింగియా గ్రామంలో మంగళవారం ముమ్మర దాడులు చేపట్టారు. ఇళ్లల్లో చొరబడి, వెంటాడి మరీ పలువురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో ప్రమేయం ఉన్న 19మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఫిరింగియా బ్లాక్ అధ్యక్షుడుతో పాటు ఐదుగురు పంచాయతీ సర్పంచ్‌లు, ముగ్గురు సమిత సభ్యులు ఉన్నట్లు ఐఐసీ విశ్వజిత్ జానీ తెలిపారు. అలాగే 50మందిపై కేసు నమోదు చేశామని, వారి కోసం గాలిస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

విదేశీ మద్యంతో వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న విదేశీ మద్యంతో నిందితుడు కార్తిక్

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఎన్‌ఏసీలో కార్తిక్ జానీ(29) అనే వ్యక్తి నుంచి భారీగా విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఈ మేరకు అతనిని అరెస్ట్ చేశారు. మంగళవారం మధ్యాహ్నం మార్కెట్ కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న బలిమెల ఏఎస్ఐ అజిత్‌కుమార్ షడంగి.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కార్తిక్ వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. అందులో 14.8 లీటర్ల విదేశీ మద్యం బాటిళ్లు ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, బలిమెల పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, అతనిని కోర్టులో హాజరు పరిచామని ఐఐసీ సమాన్ పట్నాయక్ తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్ట్



పోలీసుల అదుపులో జూదరులు, స్వాధీనం చేసుకున్న నగదు

బరంపురం: జిల్లాలోని రొంగాయిలొండా గ్రామం శివారులోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న జూదం అడ్డాపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.10,120 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐఐసీ అధికారి కులమణి సెఠి తెలిపిన వివరాల ప్రకారం... రొంగాయిలొండా లోని రామమందిరం సమీపంలో ఉన్న ఇంట్లో గత కొద్ది రోజులుగా జూదం అడ్డా నిర్వహిస్తున్నట్టు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు జూదం అడ్డాపై దాడి చేసి, నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.10,120 వేల నగదు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సంతోష్ నాయక్, బాలకృష్ణ సాహు, ఉమాశంకర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డిగా గుర్తించారు.

పర్లాకిమిడిలో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: పట్టణంలోని కేవుటి వీధిలోని ఓ ఇంట్లో దొంగలు చొరబడి వెండి, నగదు దోచుకున్నట్టు ఆదర్శ పోలీస్ స్టేషన్ అధికారి ఐఐసీ ప్రశాంత భూపతి తెలిపారు. కేవుటి వీధిలో పి.కృష్ణారావు శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్న తన కొడుకు వద్దకు 2రోజుల క్రితం వెళ్లాడు. ఇంటి తాళాలు తన సమీప బంధువులకు అప్పగించి, రోజూ శుభ్రం చేయించాల్సిందిగా కోరాడు. అయితే మంగళవారం ఉదయం ఇంటి గేటు తెరిచి ఉండటాన్ని గమనించి బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిబ్బంది అక్కడికి చేరుకొని, ఫోరెన్సిక్ బృందంతో తనిఖీలు చేపట్టారు. ఇంటి స్టీల్ గ్రిల్ తొలగించి, లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాలోని వెండి, ఇతర వస్తువులు ఎత్తుకు పోయినట్టు గుర్తించారు. దీనిపై ఇంటి యజమానికి సమాచారం అందించారు. అతను వచ్చిన అనంతరం పూర్తి వివరాలు సేకరించి, దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలోని ఓ పిండిమిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు కాకివీధిలోని బోడెమ్మ కోవెల సమీపంలో ఉన్న మహ్మద్ ఇజహర్‌కు చెందిన పిండి మిల్లులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి ఉన్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ. 85,500 విలువైన 2,250 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి ఇజహర్ కొనుగోలు చేసి పిండిగా మార్చి అధిక ధరలకు విక్రయించేందుకు నిల్వ చేసినట్టు అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దాడుల్లో విజిలెన్సు ఇన్‌స్పెక్టర్ డి.వి.వి.సతీష్, రెవెన్యూ ఆర్ఐ కిరణ్‌దేవ్, వీఆర్వో నాగేశ్వరరావు, హెచ్‌సీ రామ్మోహన్, పీసీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గుప్తేశ్వర్‌లో దొంగల చేతివాటం

- భక్తుల నుంచి నగదు, సెల్‌ఫోన్ల చోరీ



పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన భక్తులు

జయపురం: కొరాపుట్ జిల్లాలోని ప్రసిద్ధ శైవక్షేత్రం గుప్తేశ్వర్‌లో దొంగలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారని భక్తులు వాపోతున్నారు. ఆలయానికి వచ్చే వారి నగదు, సెల్‌ఫోన్లు అపహరణకు గురవుతున్నట్లు కేసులు నమోదవుతున్నాయి. శ్రావణ మాసం నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి, ఒడిశాలోని నలుమూలల నుంచి భోల్‌భం కావిడిదారులు గుప్తేశ్వర్‌కు చేరుకొని, పవిత్ర జలాలతో శివలింగానికి అభిషేకిస్తున్నారు. అలా వచ్చిన భక్తుల నుంచి సెల్‌ఫోన్లు, నగదు కాజేస్తున్నట్లు ఫిర్యాదులు నమోదయ్యాయి. నయాగడకు చెందిన భక్తులకు చెందిన రూ.40 వేలు, 2 సెల్‌ఫోన్లు ఎత్తుకు పోయారని బాధితులు వాపోయారు. వర్షాల కారణంగా తమ వద్ద ఉన్న నగదును బ్యాగ్‌లో భద్ర పరిచి, వాటిని తమ కారులో వదిలి పెట్టారు. దైవ సన్నిధికి వెళ్లి వచ్చి చూసేసరికి డబ్బు, సెల్‌ఫోన్లతో సహా దొంగలు ఉడాయించారని తెలిపారు. బొయిపరిగుడ సమితి పకులగుడ గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి, మల్కన్‌గిరి జిల్లా ఎంవీ–1నుంచి వచ్చిన భక్తులకు చెందిన 4 సెల్‌ఫోన్లు, జయపురం భక్తుల 2సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నారని ఫిర్యాదులు నమోదయ్యాయి. పోలీసులు స్పందించి, చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఊరికి పచ్చల హారం

- స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఊరూరా మొక్కల నాటివేత
- స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



నిర్మాణంలో ఉన్న శిలాఫలకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పంద్రాగస్టు వేడుకల సందర్భంగా ఊరికి పచ్చల హారం అలంకృతం కానుంది. నా మట్టి- నాదేశం అనే కార్యక్రమంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటే మహోన్నత కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టనున్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అన్ని సచివాలయాలు,పంచాయతీ స్థలాలు, పార్కుల్లో కూడా మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఈ కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం నిధులు ఉపయోగించుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 910 పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఒక్కో చోట 75 వివిధ రకాల మొక్కలు చొప్పున, మొత్తం 68,250 మొక్కలను నాటేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ బృహత్తర కార్యక్రమం కలకాలం గుర్తుండేలా గ్రామగ్రామాన ఒక ఫలకాన్ని ఏర్పాటు చేసి, వాటిలో ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరించనున్నారు. ఇప్పటికే ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో ఆయా ప్రదేశాలను గుర్తించారు. అక్కడకు కావాల్సిన మొక్కలు మరో రెండు రోజుల్లో చేరనున్నాయి. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శిలాఫలకాల ఏర్పాటు కూడా దాదాపు పూర్తయ్యింది. దీంతో పాటు ఆగస్టు 15వ తేదీన పండగ వాతావరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టనున్నారు. సంరక్షణ కోసం ప్రత్యేకంగా నిధులను కూడా కేటాయించారు. ఈ పథకంలో గ్రామ స్థాయిలో ప్రజా ప్రతినిధులతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ కార్యకర్తలు, సిబ్బంది, ఉపాధి హామీ వేతనదారులు భాగస్వాములు కానున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం

మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున పండగ వాతావరణంలో నిర్వహించనున్నాం. ఇప్పటికే మార్గదర్శకాలు అన్ని స్థాయిల అధికారులకు అందజేశాం. ఊరూరా శిలాఫలకంతోపాటు, ప్రతి పంచాయతీలో సచివాలయం, ఇతర సామాజిక ప్రాంతాల్లో 75 రకరకాల మొక్కలను నాటే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. – జీవీ చిట్టిరాజు, పీడీ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ.

నేడే 'నా మట్టి-నా దేశం' ప్రారంభం

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని గాంధీ స్మృతి వనంలో బుధవారం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ చేతులమీదుగా నా మట్టి-నాదేశం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు కార్యక్రమ నోడల్ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీవీ చిట్టి రాజు తెలియజేశారు. నేడు దేశవ్యాప్తంగా 'నా మట్టి-నా దేశం', 'నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' ఆజాదీకా అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేస్తామని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 910 పంచాయతీల్లో ఒక్క పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో 75 మొక్కలు చొప్పున జిల్లా వ్యాప్తంగా 68,250 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఒక మహోత్సవంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల పదో తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీలో స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ కమిటీతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల జాబితాను బుధవారం సాయంత్రంలోగా జిల్లా విద్యాశాఖ అధికారులకు అందజేయాలన్నారు. నవరత్నాలు అమలు-మెరుగైన జీవన ప్రమాణాలు, విద్యా పథకాలు-గుణాత్మకమైన విద్యా సాధన, జాతీయ విద్యాకార్యక్రమం - 2020, నాడు-నేడుతో పాఠశాలల విద్యా ప్రమాణాలు అనే అంశాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



పోలాకి సూర్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీవీ నాగజ్యోతి ఆనంద నిలయంలో నాలుగేళ్లుగా ఆశ్రయం పొందుతున్న మహిళ పోలాకి సూర్యం (64) మంగళవారం మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను దానం చేశారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ప్రోత్సాహంతో మగపటల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం ద్వారా కార్నియాలను సేకరించి విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వారికి అందజేశారు. కాగా సూర్యం మృతిపై అనురాగనిలయం సభ్యులు, నాగజ్యోతి ఆనంద నిలయం కమిటీ సభ్యులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

రవాణా అనుమతులు ఇప్పించాలి



జేడీ సుధాకర్‌తో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

పలాస: వ్యవసాయ మార్కెటు కమిటీకి సంబంధించిన ట్రాన్స్ పోర్టు పర్మిట్లు ఇప్పించాలని పలాస కాష్యూ మ్యానిఫేక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్, పారిశ్రామిక వాడ జీడి పప్పు ఉత్పత్తులదారుల సంఘం అధ్యక్షుడు మల్లా సురేష్‌కుమార్ కోరారు. పలాస ఏఎంసీ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ నెలవారీ సమీక్షలో భాగంగా అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అతన్ని జీడి వ్యాపారుల సంఘం ప్రతినిధులు కలిసి స్థానిక సమస్యలను విన్నవించారు. ఏఎంసీ అధ్యక్షుడు పి.వి.సతీష్ కూడా జేడీ దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ముఖ్యంగా జీడి రైతులు, వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

సేవలకు గుర్తింపు..



ఏఎస్పీ తిప్పేస్వామి, డీఎస్పీ శృతికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీకాకుళం అదనపు ఎస్పీ (అడ్మిన్ విభాగం), సబ్ డివిజనల్ డీఎస్పీ జె.తిప్పేస్వామి వై.శృతి రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా గుర్తింపు లభించింది. వీరి సేవలనకు గుర్తింపుగా రాష్ట్ర డైరెక్టర్ జనరల్ పోలీస్ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రశంసాపత్రాలను పంపించారు. వీటిని జిల్లా ఎస్పీ రాధిక తన చేతుల మీదుగా తిప్పేస్వామి, శృతిలకు మంగళవారం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

మెళియాపుట్టి: జాడుపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొల్లబంజీరు గ్రామానికి చెందిన సవర పవిత్ర (19) అనారోగ్య, కుటుంబ కష్టాలతో మనస్తాపానికిగురై ఈ నెల ఆరో తేదీన ఇంట్లో ఉన్న పురుగుమందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనం ద్వారా శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి పవిత్ర మృతి చెందినట్టు ఎస్సై రాజేష్ మంగళవారం తెలిపారు. మృతురాలి తల్లి భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గిరి గ్రామాల రోడ్లకు మహర్దశ



చందనగిరి రోడ్డు పనులకు భూమిపూజ చేసున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డిశాంతి చొరవతో నిధులు మంజూరు
- చందనగిరి గిరిజన గ్రామానికి 1.25 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మెళియాపుట్టి: గిరిజన గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తీరనున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరి గ్రామాల రోడ్లకు మహర్దశ పట్టింది. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక కృషితో నిధులు మంజూరు కావడంతో పలు గ్రామాలకు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఉత్తరాంధ్రలోనే ఎత్తైన గిరిశిఖర గ్రామమైన చందనగిరి గ్రామానికి రూ.1.25 కోట్లతో 3.10 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం భూమిపూజ చేశారు. అలాగే హడ్డివాడకి 1.75 కోట్లతో 2.3 కిలోమీటర్లు, కేరాసింగికి రూ. 92 లక్షలతో 1.5 కిలోమీటర్లు, కేరాసింగిగూడకు రూ.1.5 కోట్లతో 2.5 కిలోమీటర్లతో రోడ్డు పనులు చేపడుతున్నారు. ఈ పనులను కూడా ఆమె పరిశీలించారు. మొత్తం రూ. 5.42 కోట్లతో గిరి శిఖర గ్రామాలకు వెళ్లే రహదారి పనులు చేపడుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, మండలకన్వీనర్ పల్లి యోగి, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, సర్పంచులు వసంతకుమారి, జయమ్మ, జమ్మయ్య, రామచంద్ర మజ్జి, భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యురాలు సరోజిని, నాయకులు జయమునిరావు, శశిభూషణరావు, వెంకటేష్, పాపారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కేసుల్లో పురోగతి సాధించాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : దర్యాప్తులో నైపుణ్యాన్ని పెంచుకుని కేసుల్లో పురోగతి సాధించాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలోని అధికారులతో మంగళవారం నెల వారీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

సమావేశంలో పెండింగ్ ఫిర్యాదులు, తీవ్రమైన (గ్రేవ్ కేసులు) నేరాలు, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మిస్సింగ్, నాన్‌బెయిల్ వారెంట్లు తదితర అంశాలపై మాట్లాడటమే కాకుండా ముఖ్య కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం జరిగిన వెంటనే నేర స్థలానికి చేరుకుని అక్కడ క్షుణ్ణంగా పరిశీలించి సాక్ష్యాధారాలు సేకరించి కేసు ప్రాపర్టీ స్వాధీనంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్తి నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మిస్సింగ్ కేసులు త్వరితగతిన ఛేదించాలని, పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిశీలించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. సైబర్ మోసాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.

సదరం సర్టిఫికెట్ల జారీపై విచారణ



తోలాపి వాసులను విచారిస్తున్న సూర్యారావు తదితరులు

నరసన్నపేట: పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన 24 మందికి సదరం కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల సర్టిఫికెట్ల జారీపై అధికారులు విచారణ ప్రారంభించారు. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మంగళవారం విచారణ నిర్వహించారు. తోలాపికి చెందిన పొన్నాడ అప్పారావు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో తమ గ్రామానికి చెందిన 24 మంది అక్రమంగా దివ్యాంగులుగా సర్టిఫికెట్లను నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన సదరంలో పొంది ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని టెక్కలి జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావును ఆదేశించారు. దీంతో ఆయన మంగళవారం నరసన్నపేట వచ్చి విచారణ చేపట్టారు. 24 మందికి ఇచ్చిన సర్టిఫికెట్లు సక్రమమా.. అక్రమమా అనేది విచారణ చేసి లబ్ధిదారుల నుంచి వివరాలు తీసుకున్నారు. దీనిపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కాగా తోలాపికి చెందిన 24 మందికి అంగవైకల్యం పూర్తి స్థాయిలో లేకపోయినప్పటికీ నరసన్నపేట సదరంలో వైద్యులు అధికంగా ఉన్నట్లు సర్టిఫికెట్లు ఇచ్చినట్లు తెలిసింది. విచారణలో స్థానిక ఆస్పత్రి వైద్యురాలు స్ఫూర్తి, ఏఓ సంతోష్ ఉన్నారు.

హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

శ్రీకాకుళం: జిల్లా హ్యూమన్ రైట్స్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఏపీ స్టేట్ అధ్యక్షుడు అల్లు ఇమ్మానుయేలు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడుగా టొంపల పేతురు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టొంపల సూరప్పడు, వైస్ ప్రెసిడెంట్‌గా బైరి ప్రకాశరావు, జనరల్ కార్యదర్శిగా గుడివాడ ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం మండల ప్రెసిడెంట్‌గా సంతోష్ హర్షను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. మానవ హక్కుల ఉల్లంఘణకు పాల్పడిన వారిపై పోరాడాల్సిన అవసరం మనందరిపైన ఉందని ఇమ్మానుయేలు అన్నారు.

కొనసాగుతున్న వీఆర్ఏల దీక్షలు



దీక్షలో పాల్గొన్న వీఆర్ఏలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారించాలని సంఘ నాయకులు కోరారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో రెండో రోజై మంగళవారం కూడా కలెక్టరేట్ వద్ద గల జ్యోతిబాపూలే పార్క్ వద్ద దీక్షలు కొనసాగించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వీఆర్ఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సూర్యనారాయణ, తాడేల త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ మరణం తీరనిలోటు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విప్లవ గాయకుడు, ప్రజా యుద్ధనౌక, వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్ మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని దళిత, ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. గద్దర్ సంస్మరణ సభను అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువుర్తు వక్తలు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన పోరాడే గద్దర్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. తన జీవితాన్ని ప్రజల కోసమే అంకితం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాకవి నల్లి ధర్మారావు, అట్టడ అప్పలనాయుడు, వీజీకే మూర్తి, తాండ్ర ప్రకాష్, కె.వి.జగన్నాథం, కల్లేపల్లి రాంగోపాల్, తాండ్ర అరుణ, పిట్టా చంద్రపతిరావు, డీటీఫ్ నాయకుడు ధర్మారావు, డి.గణేష్, మిస్కా కృష్ణయ్య, ఎస్ కృష్ణవేణి, బోనెల అప్పారావు, తవిటమ్మ, బెలమర ప్రభాకర్, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పర్తియాత్ర భజనలు ప్రారంభం



హయాతీనగరం మందిరంలో భజనలు చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా వారి దివ్య ప్రదేశమైన పుట్టపర్తి వెళ్లేందుకు పర్తియాత్ర పూజలు ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం జోనల్ స్థాయిలో లింకు భజనలు హయాతీనగరంలోని సత్యసాయి భజన మండలిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. మందిరం కన్వీనర్ కిల్లాన ఫాల్గుణరావు ఆధ్వర్యంలో టి.ఎస్.ఎన్.మూర్తి జ్యోతి ప్రజ్వలన చేయగా, జిల్లా సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త సూర రామచంద్రరావు మూడు సార్లు ఓంకారం చేసి గణపతి ప్రార్థనతో పర్తియాత్ర లింకు భజనకు శ్రీకారం చుట్టారు. అనంతరం పట్టణంలోని సాయి గణేష్ మందిరంలో, పీఎన్ కాలనీ మందిరం, అరసవల్లి, శ్రీకూర్మం, పొందూరు, చిన్న కొంగరాం, బ్యాంకర్స్ కాలనీ, తోలాపి, న్యూకాలనీ, సతివాడ, పెద్దమందిరంలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు భజనలు చేశారు. కార్యక్రమంలో డీఈవో కె.వెంకటేశ్వరరావు, జోనల్ కన్వీనర్ పప్పుల నాగేశ్వరరావు, వెంకటరావు, పైడి కోటేశ్వరరావు, పి.ఎన్.కాలనీ పూర్వ కన్వీనర్ మురళి, సీనియర్ సేవాదళ్, పర్తి సింగర్ ఎన్.వి.ఎస్.రాజు, రాము, కృష్ణ, జెడ్పీ మందిరం పూర్వ కన్వీనర్ లింగరాజు పాల్గొన్నారు.

పలాసలో అదృశ్యం.. ఆగ్రాలో ప్రత్యక్షం



పలాసలో తిరిగి సొంతం చేసుకున్న బైకుతో మున్సిపల్ ఉద్యోగి ఉదయ్ శంకర్ పాత్రో

కాశీబుగ్గ: పలాసలో దొంగిలించిన బైక్ రూపురేఖలు మార్చి మూడు రోజుల్లోనే రాష్ట్రాలు దాటించేసిన ఘటన పలాసలో చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి బైక్ యజమాని తెలిపిన వివరాల మేరకు.. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఉదయ్‌శంకర్ పాత్రో మే 27న తన బండిని పోగొట్టుకున్నారు. పరిసర ప్రాంతాల్లో ఎంతగా గాలించినా ప్రయోజనం లేకపోయింది. అక్కడకు మూడు రోజుల తర్వాత ఆగ్రాకు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫతియాబాద్ పోలీసుల నుంచి ఆయనకు ఫోన్ కాల్ వచ్చింది. అక్కడ వాహన తనిఖీల్లో పోలీసులకు ఓ బండి దొరికిందని, ఇంజిన్ వివరాలను పరిశీలిస్తే పలాసకు చెందిన బైక్ అని నిర్ధారణ జరిగిందని వారు చెప్పారు. అయితే ఆ వాహనం ఫొటోలు చూసి ఉదయశంకర్ పోల్చుకోలేకపోయారు. తన బండి అలా ఉండదని చెప్పేశారు. కానీ అక్కడి పోలీసులు మాత్రం ఇంజిన్ వివరాలు మీ పేరు మీదే ఉన్నాయని స్పష్టం చేశారు. ట్యాంక్ కవర్ చింపేసి, అద్దాలు తీసేసి రూపురేఖలు మార్చేశారని వివరించారు. దీంతో ఆయన వెంటనే ఫతియాబాద్ వెళ్లి వాహనాన్ని పరిశీలించి అక్కడి పోలీసులకు సీ–బుక్ చూపించడంతో వివరాలన్నీ సరిపోయాయి. దీంతో ఆయనకు ష్యూరిటీపై బైక్‌ను తిరిగి అప్పగించారు. బైక్ దొంగతనాలు చేస్తున్న దొంగలు తెలివి మీరిపోయారని, రెండు మూడు రోజుల్లోనే బైక్ రూపురేఖలు మార్చేసి లారీలు ఎక్కించి రాష్ట్రాలు దాటించేస్తున్నారని బాధితుడు తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు.

క్లుప్తంగా

పోలీస్ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



హోంగార్డు రామకృష్ణకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోలీస్ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు. సెంట్రల్ హోమ్‌గార్డ్స్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మెడికల్ గ్రాంట్‌గా మంజూరు చేసిన రూ.10వేలు చెక్కును హోంగార్డు సీహెచ్ రామకృష్ణకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులతో సమానంగా పనిచేస్తున్నవారి అభ్యున్నతికి తమవంతు బాధ్యతగా తోడ్పాటునందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హోమ్‌గార్డ్ ఇన్‌చార్జి ఆర్ఐ ఎస్.గోపాలనాయుడు, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా రోడ్లు వేశారు



మాట్లాడుతున్న భూషణరావు

పార్వతీపురం: ఎన్నో ఏళ్లుగా పెంచి పోషించుకుంటున్న తోటలను క్రషర్ యజమానులు దౌర్జన్యంగా తొలగించి రహదారులు వేసుకుని తమ హక్కులను కాలరాశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని చింతాడ అప్పలనరసమ్మ, భూషణరావు తదితరులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పెదగుడబ పంచాయతీలోని కొండ పోరంబోకులో చింతాడ గట్టమ్మ పేరున సర్వేనంబర్ 352-8లో 2.38 సెంట్ల భూమిని అధికారులు మంజూరు చేశారు. ఆ భూమిలో మొక్కలను పెంచి పోషించుకుంటున్నాం. అయితే ఆట్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం దౌర్జన్యంగా ఆ భూమిలో చొరబడి యంత్రాలద్వారా మొక్కలను రాత్రికిరాత్రి తొలగించి రోడ్లు వేశారని వాపోయారు. ఈ విషయమై గరుగుబిల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి మహిళ మృతి



బైక్ ప్రమాదంలో మృతి చెందిన ఇమాంబి

వేపాడ: ఎస్.కోట-కొత్తవలస రహదారిలో కొత్తబొద్దాం జంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. బొద్దాం గ్రామానికి చెందిన దంపతులు మహమ్మద్, ఇమాంబి ఎస్.కోటలో బంధువుల ఇంటికి మంగళవారం ఉదయం వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తబొద్దాం జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పడంతో ఇద్దరూ కిందపడి పోగా ఇమాంబి మృతి చెందింది. మహమ్మద్ కుడికాలికి గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పౌష్టికాహారంలో ఆరోగ్యం



బాలింతలకు కిట్లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సంధ్యారాణి తదితరులు

నెల్లిమర్ల రూరల్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కౌన్సిలర్ జానా సంధ్యారాణి సూచించారు. పట్టణ పరిధిలోని స్థానిక గాంధీ నగర్ కాలనీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహారాన్ని పంపిస్తోందని, బాలింతలు, గర్భిణులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్, కళ్యాణ చక్రవర్తి, రోటరీ క్లబ్ ప్రతినిధులు గ్రంధి కృష్ణ, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు,కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

ప్రకృతితో మమేకం.. ఆదివాసీల జీవనం



తిరగలి సాయంతో పిండితయారీలో గిరిజన మహిళ

- అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- సాలూరులో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- సీతంపేట ఐటీడీఏలోనూ ఆదివాసీ పండగకు ఏర్పాట్లు

సాలూరు/సీతంపేట/గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీల జీవనం ప్రకృతితో మమేకం. రుతువులను అనుసరిస్తారు. కాలగమనంతో ముందుకు 'సాగు'తారు. వనాలే జీవనాధారంగా మలచుకుంటారు. ప్రకృతి ఒడిలో ప్రశాంత జీవనం సాగిస్తారు. పుట్ట, రాళ్లరప్పలు, కొండలు, చెట్లు, పూలు, ఆయుధాలను దేవతలుగా కొలుస్తారు. ఐక్యంగా పండగలను నిర్వహిస్తారు. సాంస్కృతిక ప్రదర్శనలతో అలరిస్తారు. సాలూరు, సీతంపేటలలో బుధవారం జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో తమ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేందుకు సిద్ధమవుతున్నారు. గిరిజన ఉత్పత్తుల ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఆదివాసీలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గిరిజనుల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటుచేసింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో దాదాపు 28 వేల ఎకరాల విస్తీర్ణంలో 18 వేల మంది గిరిజనులకు అటవీ సాగుహక్కు పత్రాలను అందజేసింది. ఏటా గిరిజన రైతులకు వైఎస్సార్ రైతుభరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందజేస్తోంది. గిరిజన గూడలను కలిపేలా రోడ్లు నిర్మిస్తోంది. వరదల భారి నుంచి రక్షించేలా 114 రక్షణ గోడలను నిర్మించింది. రక్తహీనతతో బాధపడే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణప్లస్ పథకాల కింద పౌష్టికాహారం అందజేస్తోంది. గిరిజనుల వైద్యం కోసం పార్వతీపురంమన్యం జిల్లాకు వైద్యకళాశాలను మంజూరు చేసింది. సీతంపేట, పార్వతీపురంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మించింది. రోగులను అత్యవసరవేళ ఆస్పత్రులకు చేర్చేందుకు 108వాహనాలతో పాటు బైక్ అంబులెన్స్‌లు ఏర్పాటుచేసింది. గిరిజన గ్రామాల ప్రజలకు సెల్ సిగ్నల్ సమస్యలకు పరిష్కారం చూపుతోంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మ్యూజియంను సీతంపేట పీఎంఆర్‌సీలో ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఆదివాసీ జీవన విధానం ప్రతిబింబించే చిత్రాలు, విగ్రహాలను అమర్చుతోంది. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తోంది.



గిరిజనులు పండించే చిరుధాన్యాలు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వాహణ ఎందుకు?

ఆదివాసీల జీవన స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1994 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ దాదాపు ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌ఓ ప్రకటించింది.

జీవనం విభిన్నం.. వైవిధ్యం

- ఆదివాసీలు అటవీ సంస్కృతికి ప్రతీకలు. ఘన చరితకు వారసులు. వారి ఆధ్యాత్మిక చింతన వినూత్నం. వారి కట్టూ బొట్టూ చూడనలవిగా ఉంటాయి. తెల్లారితే కొండపోడు వ్యవసాయం, అటవీఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం సాగుతుంది. ప్రతీ మూడు నెలలకు ఒక్కో పంట ఉత్పత్తుల సీజన్ ఆరంభమౌతుంది. పైనాపిల్, సీతాఫలం, పసుపు, జీడి, కందులు, నిమ్మ, బత్తాయి, పెండలం ఇలా అటవీ ఉత్పత్తులతోనే వీరి జీవనం ముడిపడి ఉంది. వారంవారం జరిగే వారపు సంతల్లో పంటలను విక్రయించి, వారికి కావాల్సిన సరుకులను కొనుగోలు చేస్తారు. భార్యకు కట్నం ఇచ్చి వివాహం చేసుకునే 'మొగనాలి' ఇప్పటికీ కొన్ని చోట్ల అమల్లో ఉంది.
- పోడు వ్యవసాయం ప్రధాన జీవనాధారం. భూఉపరితలానికి అత్యంత ఎత్తైన కొండ గూడల్లో నివసిస్తూ భయమంటే తెలియదన్నట్టుగా క్రూర మృగాల, విషసర్పాల నీడలో సాహస జీవితం గడుపుతుంటారు. డోకి, గిడుగు, కొబ్బరి గరిటెలు, పండ్ల గంపలు, మట్టికుండలు, కుంచాలు, అడ్డలు వంటివి ఉపయోగిస్తారు. వెదురు కర్రలతో తయారు చేసిన తుడుము, మద్దెల, గజ్జెలు, కిన్నెర, పిల్ల నాగర, తాళాలు వంటి వస్తువులను తయారు చేసి నృత్యాలకు ఉపయోగిస్తారు.
- ఆదివాసీలు ప్రధానంగా దంపుడు బియ్యం, గంటి, జొన్న, కొర్ర, జీలుగ పిండితో జావ చేసుకుని తాగుతారు. అడవిలో లభించే ఆకు కూరలు, దుంప కూరలను ఆహారంగా వినియోగిస్తారు. బొదం దం కూర, చిట్టికూర, గురుంకూర, పుల్లేరుగుడ్లను కూరగా వండి తింటారు.
- అక్షరాలను ఆరాధ్యదేవతలుగా పూజిస్తారు. ఏజెన్సీలో అక్షరబ్రహ్మ, మడిబ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. ప్రతి గురువారం ఆలయాల్లో పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది.
- ఆదివాసీ ప్రాంతాల్లో వివాహ ఆచారం వింతగా ఉంటుంది. మైదాన ప్రాంతంలో వరకట్న భూతం వెంటాడుతున్న నేటి రోజుల్లో ఇందుకు భిన్నంగా ఆదివాసీ గ్రామాల్లో వరుడు కుటుంబ సభ్యులు వధువు కుటుంబానికి ఓలి (తెరిగికట్నం) ఖర్చుల నిమిత్తం ఇచ్చే ఆచారం ఉంది. ఆదివాసీలు నిరంతర శ్రమజీవులు. అయినా తీరిక వేళల్లో మాత్రం ఆటపాటలు, ఆనందాలకు ప్రాధాన్యం ఇస్తారు. పండగలన్నీ ప్రకృతి, ఫలసాయాల సేకరణ, గ్రామదేవతలకు సంబంధించినవే ఉంటాయి. కందికొత్తలు, ఆగం, టెంక పండగలను డప్పుల వాయిద్యాలతో గ్రామాల్లోని గిరిజనులంతా ఏకమై నిర్వహిస్తారు.



కొండవాలులో వరి పంట సాగు

అడవితల్లికి క్షీరాభిషేకం



అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న పీఓ విష్ణుచరణ్, గిరిజన నాయకులు

పార్వతీపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలోని అడవితల్లి విగ్రహానికి పీఓ సి. విష్ణు చరణ్ క్షీరాభిషేకం చేశారు. గిరిజన సంప్రదాయ పద్ధతిలో పూజలు జరిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, అమర్‌నాథ్, తమ్మయ్య, రంజిత్‌కుమార్, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఏర్పాట్లను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఏర్పాట్లలో రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు.

గిరిజనాభివృద్ధికి కృషి



నాలుగేళ్లలో గిరిజనుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తోంది. గిరిజన పండగల నిర్వహణకు అధిక ప్రాధాన్యమిస్తోంది. రాష్ట్రస్థాయి ఆదివాసీ పండగను సాలూరులో నిర్వహించడం, సీతంపేట ఐటీడీఏలోను ఆదివాసీ పండగను వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం ఆనందంగా ఉంది.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఐటీడీఏ ద్వారా గిరిజనులకు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా పథకాలు అమలు జరిగే చర్యలు తీసుకుంటున్నాం. గిరిజన కళల అభివృద్ధిలో భాగంగా సవర పెయింటింగ్ కళాకారులకు సీడాప్ ద్వారా శిక్షణ ఇప్పించనున్నాం. గిరిజన అటవీఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. గిరిజన యువతకు స్కిల్ కళాశాల, స్కిల్‌హబ్ వంటివి ఏర్పాటు చేశాం. ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం.

– కల్పనాకుమారి, ఐటీడీఏ పీఓ

పోలీస్ నిఘా మరింత పటిష్టం



పార్వతీపురం పట్టణంలో రహదారి భద్రతా నియమావళిపై అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

- శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి
- నేరాలు, పౌర రుగ్మతలను నివారించడమే లక్ష్యం

పార్వతీపురం టౌన్: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న రాష్ట్రప్రభుత్వం ప్రజల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోంది. ఈ మేరకు పోలీసు వ్యవస్థలో అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. అందులో భాగంగానే దిశ యాప్‌ను ప్రవేశపెట్టి మహిళలకు రక్షణగా నిలుస్తోంది. సారా మహమ్మారికి బలికాకుండా ఉండేందుకు పరివర్తన 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఓ పక్క ప్రజలకు అవగాహన కల్పిస్తూ మరో పక్క అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతోంది. మహిళలపై దాడులు జరగకుండా ఉండేందుకు బహిరంగ మద్యపానం చేసేవారిని వదిలిపెట్టకుండా కేసులు నమోదు చేస్తున్నారు. నేరాల నియంత్రణకు పీడీ యాక్ట్, రౌడీ షీట్ తెరిచి నేర నియంత్రణకు కృషిచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టపరుస్తూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నేరాలు, పౌర, సామాజిక రుగ్మతలను నివారించడమే ధ్యేయంగా కృషిచేస్తున్నారు.

బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం

జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే మందుబాబులను కట్టడి చేసేందుకు పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టారు. కొన్ని నెలలుగా ఈ డ్రైవ్‌లో ఎవరైనా జన సంచారంతో రద్దీగా ఉండే కూడళ్లలో, పట్టణ, గ్రామాల శివారుల్లో మద్యం తాగినట్లు కనిపిస్తే కౌన్సెలింగ్ చేస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ వెళ్తే జరిగే ప్రమాదాల వల్ల కలిగే ప్రాణాపాయం, కుటుంబ, ఆర్థిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నారు. బహిరంగ మద్యపానం చేసినవారిపై కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం చేసిన వారిపై ఆరు నెలల్లో 4,917కేసులను నమోదు చేశారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ కేసులు 1148 నమోదు చేశారు.



పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసు సిబ్బంది

జూదరుల ఆటకట్టు...

అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉండడంతో అమాయక ప్రజలను జూదం ఆడేందుకు ప్రోత్సహించి వారి సొమ్ము కాజేస్తున్న జూదరులపై ప్రత్యేక నిఘా పెట్టారు. గత 6నెలల్లో జిల్లా పరిధిలో 50 సంఘటనల్లో 293 మందిపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.7,67,906ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తున్నారు. ప్రతి శనివారం జిల్లా వ్యాప్తంగా నో యాక్సిడెంట్ డే కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లావ్యాప్తంగా పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గతంతో పోలిస్తే జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టింది. గడిచిన ఆరు నెలల్లో రోడ్డు ప్రమాదాల్లో 137 మంది గాయపడగా 56మంది మృతిచెందారు.

మాదక ద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక దృష్టి

జిల్లాకు గిరిజన ప్రాంతం సరిహద్దుగా ఉండడంతో సారా, మద్యం, గంజాయి అక్రమ రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు వాటివల్ల కలిగే నష్టాలను వివరించేందుకు క్రమం తప్పకుండా పరివర్తన 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆరు నెలల్లో సారా రవాణా చేస్తున్న వారిపై 340 కేసులు నమోదు చేసి 337మందిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న మద్యంపై 98 కేసులు నమోదు చేసి 99మందిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై 5కేసులు నమోదు చేసి 9మందిని అదుపులోకి తీసుకున్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం



జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. గిరిజనుల సమస్యల పరిరక్షణలో భాగంగా సారా, మద్యం, గంజాయి రవాణాపై నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నాం. గిరిజనులను మభ్యపెట్టే విధంగా వ్యవహరించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు పోలీసు సిబ్బంది అంతా కృషి చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు క్రమం తప్పకుండా అవగాహన కల్పిస్తున్నాం.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, పార్వతీపురం మన్యం

గంజాయితో పట్టుబడిన విద్యార్థి

- 1800 గ్రాముల సరుకు స్వాధీనం



గంజాయితో పట్టుబడిన విద్యార్థిని విలేకరుల ఎదుట హాజరుపరిచిన సీఐ ఉపేంద్ర

రాజాం సిటీ/రేగిడి: ఇంటి పెద్ద మరణించడంతో కుమారుడిని చదివించి ప్రయోజకుడిని చేయాలనుకున్న తల్లి ప్రయత్నం వృథాగా మారింది. ఐటీఐ చదువుతున్న విద్యార్థి గంజాయికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో ఐటీఐ పరీక్షల నిమిత్తం స్వగ్రామానికి వచ్చి గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజాం రూరల్ సర్కిల్ కార్యాలయాలంలో సీఐ హెచ్.ఉపేంద్ర మంగళవారం వెల్లడించారు. రేగిడి మండలం పారంపేట గ్రామానికి చెందిన విద్యార్థి తండ్రి మరణించిన తరువాత తల్లి బతుకు తెరువుకోసం విజయవాడ తీసుకువెళ్లిపోయింది. అక్కడ పళ్ల వ్యాపారం చేసుకుంటూ పదో తరగతి వరకు చదువుకున్న సమయంలో ఆ విద్యార్థి పూర్తిగా గంజాయికి అలవాటుపడ్డాడు. తరువాత రాజాంలోని కళాశాలలో ఐటీఐలో చేరాడు. ఈ ఏడాది జూలై 1 నుంచి పరీక్షలు ఉండడంతో స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్న ఆ విద్యార్థి గంజాయి విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించాలని భావించాడు. అదే తడవుగా తాతగారి ఊరైన రాజాం మండలం గడిముడిదాం గ్రామానికి చెందిన ప్రస్తుతం అరకులో ఉంటున్న పైల వెంకటేష్‌ను సంప్రదించాడు. వెంకటేష్ ద్వారా రెండు కిలోల గంజాయి తెప్పించాడు. అందులో కొంత సరుకును రాజాం పట్టణానికి చెందిన కిరణ్‌కు విక్రయించాడు. మిగతా గంజాయిని తాను వినియోగించడంతోపాటు విక్రయించేందుకు మోటార్ సైకిల్ ముందుభాగంలో పెట్టుకుని స్వగ్రామం నుంచి వెళ్తున్నాడు. అదే సమయంలో రేగిడి మండలం బూరాడ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై ఇ.శ్రీనివాస్ విద్యార్థి బైక్ ఆపి సోదాచేయగా గంజాయి పట్టుబడింది. దీంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో తూకం వేయగా 1800 గ్రాములు ఉందని నిర్ధారించి నిందిత విద్యార్థిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ నేరంలో భాగస్వాములైన మిగిలిన ఇద్దరిని పట్టుకుంటామని సీఐ వెల్లడించారు. సమావేశంలో సీఐతోపాటు ఎస్సై ఇ.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సహాయ సంచాలకురాలు మహాలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట కోత ప్రయోగాలను కచ్చితంగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక జిల్లా వనరుల కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏఎస్‌ఓలకు పంట కోత ప్రయోగాలపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ సీసీఈ (క్రాప్ కటింగ్ ఎక్స్‌పెరిమెంట్) యాప్‌ను వినియోగించి వివరాలను పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. దీని వల్ల రైతులకు సంబంధించిన వివరాలు కచ్చితంగా తెలుసుకోవడంతో పాటు, బీమా వర్తింపులో ఉపయోగపడతుందన్నారు. జిల్లా స్థాయి శిక్షణలో తెలుసుకున్న అంశాలపై మండల, గ్రామ స్థాయిలో శిక్షణలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సీసీఈ కార్యాలయం సహాయ సంచాలకురాలు మహాలక్ష్మి సీసీఈ యాప్ వినియోగం, పంట కోత ప్రయోగంలో అవలంబించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, ఎ.డి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాట రాయళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: విజయనగరం మండల పరిధి వేణుగోపాలపురం డైట్ కళాశాల సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను రూరల్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.27,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ధర్మపురి గ్రామంలో పేకాట ఆడుతున్న ముగ్గుర్ని, బియ్యాల పేట గ్రామంలో ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై గణేష్ తెలిపారు.

సాగునీటి సరఫరాకు లష్కర్ల నియామకం

- రూ.13 వేల వేతనంతో 61 మందికి బాధ్యతలు

బొబ్బిలి: వ్యవసాయం దండగ అన్న టీడీపీ పాలన నుంచి వ్యవసాయం పండగ అనే పరిస్థితులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. తీసుకువచ్చింది. సాగునీటిని సక్రమంగా పంపిణీ చేసే లష్కర్లను నియమించకుండా టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించగా, ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు లష్కర్లను నియమించింది.

రైతులు మొర పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

ఉమ్మడి జిల్లాలోని ఏకైక భారీ తరహా సాగునీటి ప్రాజెక్టు తోటపల్లి. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షా 30వేల పై చిలుకు సాగునీటి సరఫరా లక్ష్యంగా ఉన్నప్పటికీ గత ప్రభుత్వం హయాంలో లష్కర్లను నియమించలేదు. ఏటా ప్రతిపాదనలే తప్ప వాటి ఊసే లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు, తగవులు పడేవారు. నీటిని సక్రమంగా ఎక్కడా ఆటంకాలు లేకుండా పంపిణీ చేయడంలో లష్కర్లు నిత్యం కాలువల వెంట తిరుగుతుంటారు. దీంతో రైతులకు అవసరమైన నీరు అందుతుంది. కానీ రైతులు ఎన్నిమార్లు విన్నవించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వాన్ని అధికారులు, రైతులు కోరుతుండడంతో జెడ్పీ గ్రాంట్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో లష్కర్ల నియామకం జరిగింది.



తోటపలి ప్రాజెక్టు

రెండు డివిజన్లకు రూ.11లక్షలు

జిల్లాలో తోటపల్లి ప్రధాన కాలువ ద్వారా ప్రవహించే సాగునీరు పార్వతీపురం, రాజాం డివిజన్ల ద్వారా సరఫరా అవుతోంది. పార్వతీపురం డివిజన్‌లో కొత్త ఆయకట్టు 20వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. దీనికి గాను 26 మంది లష్కర్లను నియమించారు. అలాగే రాజాం డివిజన్‌లో ఇదే ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా లక్షా 11వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ఇక్కడ 35 మంది లష్కర్లను నియమించారు. ఒక్కో లష్కర్‌కు రూ.13వేలు చొప్పున వేతనంగా ఇవ్వనున్నారు.



రామచంద్ర రావు, ఈఈ

లష్కర్లను నియమించాం

తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో రాజాం, పార్వతీపురం డివిజన్లకు సంబంధించి రూ.11 లక్షల జెడ్పీ గ్రాంట్‌తో లష్కర్లను నియమించాం. పార్వతీపురం డివిజన్‌కు 26 మంది, రాజాం డివిజన్‌కు 35 మంది నియమితులయ్యారు. లష్కర్ల నియామకం వల్ల సాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుంది.

కీచక టీచర్ అరెస్ట్

- పోక్సో ప్రకారం కేసు నమోదు



నిందితుడు సైన్స్ టీచర్ రాముడు

విజయనగరం క్రైమ్/రాజాం సిటీ: దిశ ఎస్‌ఓఎస్ యాప్ బాలికలకు వరంగా మారింది. సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పట్టుకుని, మహిళలకు అండగా నిలబడుతూ తామున్నామనే భరోసా కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దిశ యాప్‌పై ప్రజలకు అవగాహన పెరగడంతో కేసులు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా వంగర మండల ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు రాములు పదోతరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తన సెల్‌ఫోన్‌లో బాలిక ఫొటోలు తీశాడు. ఆ ఫొటోలను బాలికకు చూపించి బ్లాక్‌మెయిల్ చేశాడు. కీచక టీచర్ ఆగడాలను తట్టుకోలేకపోయిన బాధిత బాలిక దిశ ఎస్‌ఓఎస్‌కి కాల్ చేసి తన గోడు వెళ్లబోసుకుంది. ఫిర్యాదు అందుకున్న నిమిషాల వ్యవధిలోనే దిశ పోలీసులు బాధితురాలి ఇంటికి చేరుకున్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో టీచర్ రాముడును వంగర పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సైన్స్ టీచర్ రాముడు ఫోన్‌లో ఉన్న ఫొటోలు, మెసేజ్‌లను ఆధారాలుగా సేకరించారు. విచారణ అనంతరం నిందితుడిపై పోక్సో, ఐటీ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్ నమోదుచేసి అరెస్టు చేశారు. ఎవరికీ చెప్పుకోలేని దీనస్థితిలో ఉన్న తమకు దిశ పోలీసులు అండగా నిలబడి న్యాయం చేశారని బాధితురాలి కుటుంబసభ్యులు పేర్కొన్నారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.